**గుడ్ బై 2025**







**బాలిక ఆత్మహత్య.. ప్రేమ విఫలమే కారణమా..!**

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## జాతీయ వాలీబాల్ టోర్నీకి మగ్గిడి విద్యార్థినులు




**అక్షరటుడే, ఆర్మూర్:** జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు మగ్గిడి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పీడీ మధుసూదన్ పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 7 వరకు కరీంనగర్ జిల్లా పెద్దపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 14 వాలీబాల్ టోర్నీలో తమ పాఠశాల విద్యార్థులు హిమప్రియ, ప్రణిత ప్రతిభ కనబర్చారన్నార. దీంతో జాతీయస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జనవరి 5వ తేదీ నుంచి ఏపీలోని కడపలో జాతీయ వాలీబాల్ టోర్నీ జరగనుందన్నారు. ఈ మేరకు విద్యార్థులను హెచ్ఎం తిరునగిరి హరిత వీడీసీ సభ్యులు, సిబ్బంది అభినందించారు.









నిజామాబాద్ నగరంలో స్వామివారిని మొక్కుతున్న మహిళ

# భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి..




'ఓం నమో నారాయణాయ.. ఏడుకొండల వాడా వెంకటరమణా గోవిందా గోవిందా'.. అనే నామస్మరణతో ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాలు మార్మోగాయి. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేంకటేశ్వరాలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా భక్తులు ఆలయ ప్రవేశం చేసి స్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా కేంద్రంలోని జెండా బాలాజీ మందిరం, గంగాస్థాన్ ఉత్తర తిరుపతి, చక్రం గుడి, సుభాష్ నగర్ రామాలయం, ఖిల్లా రామాలయం, డిచ్‌పల్లి రామాలయం, గుండారం అనంత పద్మనాభ ఆలయంలో ప్రత్యేక పూజలు, ఉత్తర ద్వారం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిశాయి. నగరంలోని జెండా బాలాజీ ఆలయంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సుభాష్‌నగర్‌లోని రామాలయంలో స్వామివారి పల్లకీ సేవ ప్రత్యేకంగా నిలిచింది. మహిళలు, భక్తులు దాండియా ఆటలతో అలరించారు. అలాగే నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల ఆలయంలో ధర్మకర్తలు నర్సింగ్‌రావు, దిల్ రాజు పాల్గొని పూజలు నిర్వహించారు.

- అక్షరటుడే, ఇందూరు

– మిగతా ఫోటోలు 2వ పేజీలో..








బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి..



నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమలలో..





ఆర్మూర్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన సైకత శిల్పాలు



సాండ్ ఆర్ట్‌తో దశావతారాల ప్రదర్శన



ఆర్మూర్‌లోని కుక్క గుట్టలో..



## హెచ్ఎం, జీపీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

**అక్షరటుడే, గాంధారి:** గాంధారి మండలంలోని వండ్రీకల్ ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం సందర్శించారు. నిర్వహణ తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ హెచ్ఎం, పంచాయతీ సెక్రెటరీకి నోటీసులు జారీ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు వరండాలో కూర్చుని చదువుకుంటుండడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణ చుట్టూ చెత్త పేరుకుపోయి ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు తరగతి గదుల్లోనే బోధన జరగాలని.. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని హెచ్ఎంకు సూచించారు. మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వంటగదిని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. తరగతి గదుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడికి నోటీసులు జారీ చేయాలని విద్యాశాఖ అధికారి రాజుకు సూచించారు. అలాగే శానిటేషన్‌లో నిర్లక్ష్యం వహించిన పంచాయతీ సెక్రెటరీ వెంకటచారికి నోటీసులివ్వాలని సంబంధిత అధికారికి ఆదేశాలు జారీ చేశారు. గాంధారిలోని ఓ ఫర్టిలైజర్ షాప్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, డీఈవో రాజు, డీఆర్డీవో సురేందర్, డీపీవో మురళి, తహశీల్దార్ రేణుక, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంఈవో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## గుత్ప ఎత్తిపోతల నుంచి నీరు ఇవ్వాలని రైతుల విన్నపం

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండలం గుత్ప ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటిని విడుదల చేయాలని ఆలూర్ గ్రామస్థులు కోరారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్‌కు ఆలూర్ సర్పంచ్ ముక్కెర విజయ్, వీడీసీ అధ్యక్షుడు మగ్గిడి సూర్యరెడ్డి కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామ రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు వేయడానికి నీటి అవసరం ఉందన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని గుత్ప ఎత్తిపోతల పథకం నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు. వీడీసీ అధ్యక్షుడు మగ్గిడి సూర్య రెడ్డి మాట్లాడుతూ.. గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా నీరు విడుదలైతే ఆలూర్‌తో పాటు పరిసర ప్రాంతాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సాగునీటి సదుపాయం కల్పించడం ద్వారా పంట దిగుబడులు పెరిగి రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లారెడ్డి, తొర్లికొండ ప్రవీణ్, బార్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.






## జిల్లాలో నేరాలను అదుపు చేశాం : సీపీ సాయిచైతన్య

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఈ ఏడాది జిల్లాలో నేరాలను అదుపు చేశామని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వార్షిక ప్రణాళికను వెల్లడించారు. ఈ ఏడాది జిల్లాలో క్రైమ్ రేటును 4 శాతం తగ్గించామని సీపీ వెల్లడించారు. మహిళలపై అఘాయిత్యాలు, ఫోక్సో కేసులు స్వల్పంగా పెరిగాయన్నారు. జిల్లాలో గ్యాంగ్ వార్ లేకుండా చేశామని వెల్లడించారు. డ్రంకన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, కఠినంగా వ్యవహరించామని తెలియజేశారు. జిల్లాలో సైబర్ క్రైమ్‌లు పెరిగాయని తెలిపారు. సైబర్ నేరాల విషయంలో గతేడాదితో పోలిస్తే 30శాతం పెరుగుదల ఉందన్నారు. సైబర్ క్రైమ్ ద్వారా మోసపోయిన బాధితుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై వెంటవెంటనే స్పందిస్తూ డబ్బులను రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రికవరీ రేటు పెరిగిందని పేర్కొన్నారు. పోలీసులు అంకిత భావంతో పనిచేస్తూ లా అండ్ ఆర్డర్‌ను పరిరక్షించేందుకు కృషిచేస్తున్నారన్నారు. లా అండ్ ఆర్డర్ విషయంలో ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులను ఆదేశిస్తూ తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు నిబంధనల మేరకు జరుపుకోవాలని సీపీ సూచించారు. యువత హద్దు మీరితే కఠినచర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

## ఆధునిక వరి సాగుపై రైతులకు అవగాహన



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు మండలం ఢీకంపల్లిలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు వరిసాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తడి-పొడి విధానం ద్వారా యాజమాన్యం, నేరుగా వరి విత్తే పద్ధతి, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం వంటివాటిపై రైతులకు వివరించారు. నూతన సాగు పద్ధతులను అనుసరించడంతో పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా కూలీల వ్యయం సుమారు రూ.8 వేల వరకు ఆదా అవుతుందన్నారు. సాగు సమయం కూడా గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని వివరించారు. చీడపీడల నివారణ మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నయ్య, ఉపసర్పంచ్ రాజేందర్, ట్రైనర్ వీరస్వామి, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ సుస్మిత, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ మధు, రాజేష్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు సన్మానం



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థిని రిషిత, కొత్తపల్లి సూర్యవర్మ గోల్డ్ మెడళ్లు సాధించగా, భవ్యశ్రీ సిల్వర్ మెడల్ సాధించింది. ఈ మేరకు సర్పంచ్, ఉప సర్పంచ్‌లు కొత్తపల్లి హారిక, కొత్తపల్లి అశోక్ విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ముందు కష్టపడి జాతీయస్థాయిలో రాణించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయన్న, పీడీ నాగభూషణం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాకుమారి, రాకేష్ గౌడ్, రోహిత్, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆర్నెళ్లుగా జీతాల్లేక లైన్‌మెన్లకు ఇబ్బందులు

**అక్షరటుడే, బాల్కొండ:** ఆర్నెళ్లుగా జీతాల్లేక ఇబ్బందుల పడుతున్నామని నియోజకవర్గంలోని మిషన్ భగీరథలో పనిచేస్తున్న లైన్‌మెన్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులను ఆశ్రయించినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఐఎచ్‌పీ ఇంజినీర్ రవితేజను కలిసి జీతాలు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లైన్‌మెన్లు గంగాధర్, రమేష్, నాగరాజు, నరేందర్ గౌడ్, విగ్నేష్ గౌడ్, ధర్మేందర్, సతీష్, అభి, మచ్చేందర్ తదితరులున్నారు.

## విజ్ఞాన సందర్శనకు వెళ్లిన విద్యార్థులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఒకరోజు విజ్ఞాన సందర్శన నిమిత్తం మంగళవారం తరలివెళ్లారు.విజ్ఞాన సందర్శనలో భాగంగా పోచారం అభయారణ్యం, హర్షసాయి నర్సరీని సందర్శించారు. ఈ సదర్భంగా నర్సరీలో వివిధ రకాల మొక్కలను వాటిని సాగుచేసే విధానం, అంటు కట్టే విధానం, కంపోస్ట్ తయారీ, గ్రీన్ హౌసెస్ గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. విజ్ఞాన సందర్శనలో భాగంగా కెమిస్ట్రీకి సంబంధించిన బయోడిగ్రేడల్ కవర్లు తయారు చేసే ఎస్ఆర్‌కే ఎంటర్‌ప్రైజెస్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంల కళాశాల సైన్స్ విభాగాధిపతి బి అరుణ్ కుమార్, బోటనీ అధ్యాపకురాలు ఎస్. గోదావరి, కెమిస్ట్రీ అధ్యాపకులు శశిధర్, వృక్షశాస్త్ర అధ్యాపకులు చంద్రకాంత్, సైన్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాలచక్రం గిర్రున తిరిగింది. చూస్తుండగానే మరో ఏడాది కాలగర్భంలో కలిసి పోయింది. ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చిన 2025 మరో రోజులో ముగియనుంది. ప్రజలు 2026 సంవత్సరానికి స్వాగతం పలకడానికి సిద్ధం అయ్యారు. 2025లో కామారెడ్డి జిల్లాలో పలు కీలక ఘటనలు చేసుకున్నాయి. ఇందులో కొన్ని విజయాలు, కొన్ని విషాద ఘటనలు కూడా ఉన్నాయి.

\- అక్షరటుడే, కామారెడ్డి



# గుడ్ బై 2025

■ కాలగర్భంలోకి మరో ఏడాది ■ ఏడాదిలో జిల్లాలో కీలక సంఘటనలు ■ జిల్లాను ముంచెత్తిన వరదలు ■ పెద్దపులి సంచారంతో భయాందోళన



ఏడాది కాలంలో జిల్లా పోలీసులు పలు కీలక ఆపరేషన్లు చేపట్టారు. ముఖ్యంగా ఎస్పీ రాజేశ్ చంద్ర పోలీస్ శాఖను గాడీలో పెట్టారు. పలు గ్యాంగ్‌లను అరెస్ట్ చేయడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై సైతం వేటు వేశారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసి శాఖపై పట్టు సాధించారు. ఏకంగా ఇద్దరు ఎస్సైలు, హోంగార్డులు, కానిస్టేబుళ్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుని తన మార్కు చూపించారు. అప్పటినుంచి స్టేషన్లో విధులు నిర్వర్తించే సిబ్బందిలో మార్పు స్పష్టంగా కనిపించింది.



### పెద్దపులి సంచారం

జిల్లాలో ఈ ఏడాది పెద్దపులి సంచారం కలకలం రేపింది. ఐదు నెలల క్రితం రామారెడ్డి మండలం రెడ్డిపేట తండా శివారులో ఓ ఆవుపై దాడి చేసిన పెద్దపులి.. ఈ నెలలో భిక్కనూరు, దోమకొండ మండలాలలో ఆవులపై దాడి చేసింది. దాదాపు 40 ఏళ్ల తర్వాత జిల్లాలో పెద్దపులి సంచరించడం గమనార్హం. దాని జాడ కోసం అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది.

### ముంచెత్తిన వరదలు

కామారెడ్డి జిల్లాను ఈ ఏడాది వర్షాలు ముంచెత్తాయి. ముఖ్యంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో ఆగస్టు 27వ తేదీన భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రం వరద నీటిలో మునిగిపోయింది. పట్టణంలోని జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీలు వరద ధాటికి నీట మునిగిపోయాయి. ప్రజలు రాత్రంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపారు. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. చెరువులు, కుంటలను వరదలు ముంచెత్తాయి. వరదల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. వేలాది కోళ్లు, పశువులు చనిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. పలు గ్రామాలు అంధకారంలో ఉండిపోయాయి. సుమారు 50వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. భారీ వరదలో అల్లాడిన కామారెడ్డికి వరద సాయం అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చారు. అయితే ఇంతవరకు ఎలాంటి సాయం రాలేదు. శాశ్వత పనులకు దాదాపు రూ.260 కోట్లు కావాలని ప్రతిపాదించారు. దాంతో తక్షణ మరమ్మతుల కోసం రూ.38.68 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఆపై వరద సాయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

### ఏసీబీ పంజా

జిల్లాలోని అవినీతి అధికారులపై ఏసీబీ పంజా విసిరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో దాడులు చేపట్టింది. ట్రాప్ కేసులతో పాటు, ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఓ కేసులో రూ.12,500 లంచం తీసుకుంటూ లింగంపేట ఎస్సై ఏసీబీకి చిక్కారు. ఇసుక ట్రాక్టర్ల రిలీజ్ కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలపై బిచ్కుంద పోలీస్ స్టేషన్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. నిందితులను విడుదల చేయించేందుకు లంచం తీసుకుంటూ అడిషనల్ పీపీ, కోర్టు కానిస్టేబుల్ జిల్లా కోర్టులోనే ఏసీబీ అధికారులకు చిక్కారు. పొందుర్తి, సలాబాత్‌పూర్ ఆర్టీఏ చెక్ పోస్టులపై ఏసీబీ దాడులు చేసింది.

### ముఠాలపై ఉక్కుపాదం

జిల్లాలో ఈ ఏడాది కిడ్నాప్, అత్యాచార కేసులు పెరిగాయి. అలాగే పలు గ్యాంగ్‌లు సైతం రెచ్చిపోయాయి. అయితే పోలీసులు గ్యాంగ్‌ల ఆట కట్టించారు. అంతర్రాష్ట్ర నకిలీ కరెన్సీ ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వివిధ రాష్ట్రాల్లో జిల్లా పోలీసులు పర్యటించి నిందితులను అరెస్ట్ చేశారు. అలాగే జాతీయ రహదారులపై దోపిడీలకు పాల్పడుతున్న పార్థి గ్యాంగ్‌ను అరెస్ట్ చేశారు. ఇళ్లలో దొంగతనాలు చేస్తున్న గడ్డపార గ్యాంగ్ ఆట కట్టించారు. ఫేక్ కరెన్సీ ముఠా గుట్టురట్టు చేయడంతో పాటు 13 మందిని అరెస్ట్ చేశారు. ఇందులో 8 మందిపై పీడీ యాక్ట్ సైతం నమోదు చేశారు.






జెండా బాలాజీ మందిరం



గంగస్థాన్‌లోని ఉత్తర తిరుపతి క్షేత్రంలో..



## భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి..



ఎల్లారెడ్డి మండల కేంద్రంలో..



ఆర్మూర్‌లో..



## అథ్లెటిలో పోచంపాడ్ విద్యార్థులకు ఛాంపియన్‌షిప్

**అక్షరటుడే, మెండోరా:** జిల్లా కేంద్రంలోని నాగారం స్టేడియంలో ఈనెల 28, 29 తేదీల్లో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారు. ఈ మేరకు మొత్తం 18 పతకాలు సాధించి జిల్లా ఛాంపియన్లుగా నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ కే.సురేందర్ తెలిపారు. విద్యార్థులు పలు ఈవెంట్లలో గోల్డ్, సిల్వర్ మెడళ్లు సాధించగా, కొంతమంది రాష్ట్రస్థాయి పోటీలకు కూడా ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఇది పాఠశాలకు గర్వకారణమని ఏటీపీ ఎం.అశ్విని పేర్కొన్నారు.



## ముప్కాల్ ఉపసర్పంచుల ఫోరం ఎన్నిక

**అక్షరటుడే, ముప్కాల్:** మండల ఉపసర్పంచుల ఫోరంను మంగళవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. ఈ మేరకు ఫోరం అధ్యక్షుడిగా ఆకుల రాజేందర్ (రెంజర్ల), ఉపాధ్యక్షురాలిగా బర్కం లావణ్య (నల్లూర్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉపసర్పంచ్ సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచులు పాల్గొన్నారు.

## వేంపల్లిలో సర్పంచ్‌కు సత్కారం



**అక్షరటుడే, ముప్కాల్:** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం వేంపల్లి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఏట్టెం మహేష్ యాదవ్, ఉపసర్పంచ్ సునీతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నరేష్, వైస్ చైర్మన్ మల్లయ్య, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రతిఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ప్రేమ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం అడ్విలింగాల్‌లో పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు తమ హక్కులతో పాటు బాధ్యతలను సైతం సక్రమంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ అనిత, హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్ రెడ్డి, స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్, సామాజిక కార్యకర్త అబ్దుల్ రజాక్, ప్రజలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## బాలిక ఆత్మహత్య.. ప్రేమ విఫలమే కారణమా..!

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన డిచ్‌పల్లి మండలంలో చోటుచేసుకుంది. డిచ్‌పల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదే గ్రామానికి చెందిన బాలుడి మధ్య గత కొంతకాలంగా ప్రేమ వ్యవహారం నడుస్తున్నట్లు సమాచారం. సోమవారం సాయంత్రం సదరు బాలిక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ప్రేమ విఫలం కావడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసింది. సూసైడ్ నోట్ విషయాన్ని గ్రహించిన బాలిక కుటుంబీకులు, బంధువులు.. సదరు బాలుడి ఇంటికి చేరుకొని నిరసనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. బాధిత కుటుంబీకులను సముదాయించి, బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో భారీగా పోలీసులు మోహరించారు.

## మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తహశీల్దార్ ప్రేమ్ సూచించారు. మండలంలోని అడ్విలింగాల్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు సకాలంలో భోజనం పెట్టకపోయినా, మెనూ పాటించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మధ్యాహ్నభోజన నాణ్యతను ఉపాధ్యాయులు తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.

